నవోదయలో టాపర్‌గా నిలిచిన ఆకుల వర్షిత



జవహర్‌నగర్: జవహర్ నవోదయ విద్యాలయ-2024 ప్రవేశ పరీక్షల్లో కాప్రా మండలం జైకిసాన్ నగర్ కాలనీకి చెందిన ఆకుల నర్సయ్య, మహేశ్వరి దంపతుల కుమార్తె వర్షిత టాపర్‌గా నిలిచింది. 2024 జనవరి 20న దేశవ్యాప్తంగా నవోదయ విద్యాలయ అర్హత ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వెలువడిన నవోదయ ఫలితాల్లో ఆకుల వర్షిత ఉత్తమ ప్రతిభ కనబర్చి టాపర్‌గా నిలిచింది. అనంతరం ఆకుల వర్షిత మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుతూ ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్) కావడమే తన లక్ష్యమన్నారు.

నీటిఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు



జవహర్‌నగర్‌లో పర్యటిస్తున్న కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీలలో సోమవారం కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి పర్యటించి నీటి ఎద్దడి సమస్యల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని, నీటి సమస్య తీవ్రంగా ఉంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్పొరేషన్ పరిధిలో నీటి కష్టాలు రానివ్వమని, నీటిని వృథా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన మాజీ ఎంపీపీ



నర్సింహ్మాగౌడ్‌కు బీజేపీ కండువా కప్పుతున్న ఈటల

మేడ్చల్: గౌడవెల్లికి చెందిన మాజీ ఎంపీపీ, బీఆర్‌ఎస్ సీనియర్ నేత నర్సింహ్మాగౌడ్ సోమవారం బీజేపీలో చేరారు. మండల నాయకులతో కలిసి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ నివాసానికి వెళ్లి ఆయన పార్టీలో చేరారు. ఈటల ఆయనకు కండువా కప్పి ఆహ్వానించారు. బీజేపీలో చేరినవారిలో ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకుడు గోవర్ధన్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు ఉన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ వైస్ ఎంపీపీ నర్సింహ్మారెడ్డి, గుండ్ల పోచంపల్లి కౌన్సిలర్లు రజిత వెంకటేష్, మల్లికార్జున్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను వీడే ప్రసక్తే లేదు: ఎంపీపీ రజిత

మేడ్చల్: రాజకీయంలో ఉన్నంత వరకు బీఆర్‌ఎస్ పార్టీలోనే కొనసాగుతామని, ఆ పార్టీని వీడే ప్రసక్తే లేదని మేడ్చల్ ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి అన్నారు. తాము పార్టీ మారుతున్నామని కొందరూ దుష్ప్రచారం చేస్తున్నారని, కొంతమంది పార్టీ మారినంత మాత్రాన తాము పార్టీ మారబోమని అని చెప్పారు. తమపై చాలా పార్టీల నాయకులు పార్టీ మారాలని ఒత్తిడి తెస్తున్నారని అన్నారు. ఎవరు పార్టీని వదిలినా నష్టం లేదని, పార్టీని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.

యువతి అదృశ్యం



అదృశ్యమైన దీపిక (ఫైల్)

మేడ్చల్‌రూరల్: డ్యూటీకని ఇంటి నుంచి బయలుదేరిన యువతి అదృశ్యమైన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం... మేడ్చల్ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉండే పూజ నవనీత కుమార్తె దీపిక(18) పూడూర్ గ్రామ పరిధిలోని ఫ్లిప్‌కార్ట్ కంపెనీలో కార్మికురాలిగా పనిచేస్తోంది. రోజులాగే గత ఆదివారం 'ఏ'షిఫ్ట్ డ్యూటీ ఉందని చెప్పి తెల్లవారుజామున 5.25 గంటకు ఇంటి నుంచి బయటకి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబీకులు కంపెనీ వద్దకు వెళ్లి విచారించగా దీపిక విధులకు రాలేదని చెప్పారు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మేడ్చల్ పోలీసులను ఆశ్రయించారు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

మేడ్చల్‌రూరల్: ఆర్థిక ఇబ్బందులకు తాళలేక ఓ వ్యక్తి లాడ్జి గదిలో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మేడ్చల్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... నగరంలోని బాలానగర్‌కు చెందిన నరేందర్(42) మెడికల్ షాపులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు కలగడంతో మనస్తాపానికి గురై ఆదివారం మేడ్చల్ పట్టణంలోని ఆర్‌ఆర్ లాడ్జిలో ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు భార్యకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. అనంతరం పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మరణించిన గుర్తుతెలియని వ్యక్తి

మేడ్చల్‌రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీ కొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో మండలంలోని పూడూర్ గ్రామ పరిధిలోని ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తి గాయాలతో పడి ఉన్నాడని డయల్ 100 ద్వారా సమాచారం అందుకున్న మేడ్చల్ పోలీసులు సంఘటనాస్థలికి చేరుకున్నారు. సుమారు 45-50 ఏళ్ల మధ్య వయస్సు గల వ్యక్తిని గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొట్టడంతో గాయాలపాలై మరణించినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సార్వత్రిక సమరం.. సిబ్బంది సిద్ధం

లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై ఈసీ ప్రత్యేక దృష్టి

- ఓటర్ల నమోదు మొదలు నామినేషన్లు, పోలింగ్, కౌంటింగ్ వరకూ సిబ్బంది ప్రాతే కీలకం
- రిటర్నింగ్ అధికారిసహా సహాయ అధికారులు నియామకం



అసెంబ్లీ సెగ్మెంట్లవారీగా పోలింగ్ కేంద్రాలు

మేడ్చల్	591
మల్కాజిగిరి	418
కుత్బుల్లాపూర్	592
కూకట్‌పల్లి	417
ఉప్పల్	407
ఎల్బీనగర్	571
కంటోన్మెంట్	232
మొత్తం	3,228

సాక్షి,మేడ్చల్ జిల్లా: సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై ఎలక్షన్ కమిషన్(ఈసీ) ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఓటరు నమోదు మొదలు అభ్యర్థుల నామినేషన్లు, పోలింగ్, కౌంటింగ్ వరకు ప్రతి ఘట్టంలోనూ అధికారులు, ఎన్నికల సిబ్బంది కీలకంగా వ్యవహరిస్తారు. వీరి ఎంపిక ప్రక్రియను ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు... జిల్లా అధికార యంత్రాంగం కొన్నినెలల ముందే ప్రారంభించింది. ఎన్నికల సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను కూడా ఇటీవల కలెక్టర్ గౌతమ్ పూర్తిచేశారు.

మల్కాజిగిరి ఆర్‌ఓగా కలెక్టర్

శాసనసభ, లోక్‌సభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ)ని నియమిస్తోంది. ప్రతి లోక్‌సభ స్థానానికి సంబంధించి జిల్లా కలెక్టర్ ఆర్‌ఓగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానానికి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆర్‌ఓగా వ్యవహరిస్తారు. నామినేషన్ ప్రక్రియ, అభ్యర్థుల తుదిజాబితా ప్రకటన, పోలింగ్ సిబ్బంది నియామకం- శిక్షణ, ఈవీఎంల ర్యాండమైజేషన్, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి వంటి అంశాలన్నీ ఆర్‌ఓ పర్యవేక్షణలో జరుగుతాయి.

సహాయ రిటర్నింగ్ అధికారులుగా..

గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి శాసనసభ నియోజకవర్గానికి ఒక ఆర్‌ఓను ఎన్నికల సంఘం నియమించింది. అలాంటి వారందరూ లోక్‌సభ ఎన్నికల సమయంలో సహాయ రిటర్నింగ్ అధికారులుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని ఐదు శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన ఐదుగురు ఆర్‌ఓలు... ఈ లోక్‌సభ ఎన్నికల సమయంలో సహాయ రిటర్నింగ్ అధికారులుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఎన్నికల నిర్వహణలో ఆర్‌ఓకు వారు సహకరించటంతో పాటు సంబంధిత శాసనసభ నియోజకవర్గాల పరిధిలో శాంతియుత వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకుంటారు. అయితే మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఏడుగురు ఆర్‌ఓలు... ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఏఆర్‌ఓలుగా విధులు నిర్వహిస్తారు.

సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం

ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం కానుంది. వీరి పరిధిలో 6 నుంచి 9 చొప్పున పోలింగ్ కేంద్రాలు ఉంటాయి. పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, నీరు, విద్యుత్తు, ఫ్యాన్లు తదితర మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత సెక్టోరియల్ అధికారులదే. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 313 సెక్టోరల్ అధికారులు విధులు నిర్వంచనున్నారు.

ప్రతి పోలింగ్ కేంద్రానికి నలుగురు సిబ్బంది

ప్రతి పోలింగ్ కేంద్రానికి ఓ ప్రిసైడింగ్ అధికారి(పీఓ)ని నియమిస్తారు. ఈవీఎంలు, వీవీప్యాట్లను పోలింగ్ కేంద్రానికి తీసుకొచ్చి.. ఓటింగ్ అనంతరం వాటిని స్ట్రాంగ్ రూంకు చేర్చే వరకు పీఓ బాధ్యత వహిస్తారు. సహాయకారిగా అదనపు ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. వీరితోపాటు ఇద్దరు పోలింగ్ అధికారులు విధులు నిర్వర్తిస్తారు. ఒకరు ఓటర్లకు ఇంకు పూస్తారు. మరొకరు ఈవీఎంల పనితీరును పర్యవేక్షిస్తారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి నలుగురు చొప్పున సిబ్బందిని నియమిస్తూ... అదనంగా 20 శాతం మంది ఉద్యోగులను రిజర్వు ఉంచేలా ఉన్నతాధికారులు కార్యాచరణ రూపొందించారు.

- మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల వివరాలు ఇలా ఉన్నాయి.

ఓటరు వివరాల కోసం..

కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ నంబర్ 1950



కలెక్టర్ గౌతమ్

సాక్షి,మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఓటరు వివరాల కోసం కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌లో టోల్ ఫ్రీ నంబర్ '1950'ఏర్పాటు చేసినట్లు మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు.ఈ కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది, పోలింగ్ స్టేషన్ల నంబర్లు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఓటరు వివరాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఫారం 6, 7, 8 లపై సంక్షిప్త సమాచారం, ఓటర్ ఐడీ, పోలింగ్ స్టేషన్, ఎపిక్ కార్డు , ఏఆర్‌ఓ, ఈఆర్ ఓ ,బీఎల్‌ఓ, సూపర్‌వైజర్ల తదితర వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

నేడు నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమావేశం

మేడ్చల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నేడు(మంగళవారం) మేడ్చల్ నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మల్లారెడ్డి కార్యాయలం ఒక ప్రకటనలో తెలిపింది. శామీర్‌పేట్ మండలం అలియాబాద్ చౌరస్తాలోని సీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు సమావేశం ఉంటుందని తెలిపారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి మల్లారెడ్డి, అభ్యర్థి లక్ష్మారెడ్డిలు సమావేశానికి హాజరవుతారని పేర్కొన్నారు.

తరలిరండి...

కీసర: నేడు(మంగళవారం) శామీర్‌పేట మండలం అలియాబాద్ చౌరస్తాలో గల సీఎంఆర్ కన్వెన్షన్ హాల్ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మేడ్చల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశానికి కీసర మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్దఎత్తున బీఆర్‌ఎస్ నేతలు, నాయకులు తరలిరావాలని జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేశ్ అన్నారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నారన్నారు. పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కూడా హాజరుకానున్నట్లు తెలిపారు.

వీబీఐటీలో ప్రాజెక్టర్లు చోరీ

ఘట్‌కేసర్: ఔషాపూర్‌లోని విజ్ఞాన్ భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీబీఐటీ)లో రెండు ప్రాజెక్టర్లు చోరీకి గురైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీఎస్ శ్రీనివాస్ ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ సైదులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి... ప్రాజెక్ట్ ప్రజెంటేషన్ కోసం ఇన్‌స్టిట్యూట్‌లోని ఆకాశ్ బ్లాక్‌లో 2, 9వ నంబరు తరగతి గదుల్లో రెండు ప్రాజెక్టర్లు ఏర్పాటు చేశారు. శని, ఆదివారాల్లో మధ్యాహ్నం వరకు ఈ గదులు తెరిచి ఉంచారు. సోమవారం ఉదయం తొమ్మిదిన్నర గంటలకు ఆ గదులను తెరిచి చూడగా ప్రాజెక్టర్లు కనిపించలేదు. కళాశాల ప్రాంగణంలో అన్ని చోట్లా వెతికినా కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యాచకుడి మృతి



మేడ్చల్‌రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యాచకుడు మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మురళీధర్, స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం ... మండలంలోని మెడిసిటీ చౌరస్తా సమీపంలోని ఘనాపూర్ వాగు వద్ద అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి గాయాలతో పడి ఉండటాన్ని గమనించిన వాహనదారులు డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు గుర్తుతెలియని వాహనం వెనుక నుండి ఢీ కొట్టడంతో మరణించినట్లు గుర్తించి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కాగా మృతుడు పూడూర్ గ్రామానికి చెందిన బీరయ్య(55)గా గుర్తించారు. భిక్షాటన చూస్తూ జీవనం సాగించే బీరయ్య మద్యం మత్తులో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

నాలా కబ్జాపై బీజేపీ నేతల ఫిర్యాదు

మేడ్చల్: పట్టణంలోని 22వ వార్డులో గల అయ్యప్ప దేవాలయం వద్ద కొంతమంది నాలా కబ్జాలకు పాల్పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకుని నాలాను కాపాడాలని పట్టణ బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్ నాగారెడ్డిని కోరారు. ఈ మేరకు బీజేపీ నాయకులు మున్సిపల్ కార్యాయలంలో నాలా కబ్జాను అడ్డుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కబ్జాదారులు నాలాలోని కాలువలను పూర్తిగా పూడ్చివేశారని, వర్షాకాలంలో వరద నీరు కాలనీలలోకి చేరే ప్రమాదం ఉందని అన్నారు. విచారణ చేసి కబ్జాదారులపై చర్యలు తీసుకుని కాలువలను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ నాయకులు మైసరి రాజు, లవంగ్ శ్రీకాంత్, చెరువు కొమ్ము శ్రీనివాస్‌గౌడ్, జాకట ప్రేందాస్, కానుకంటి వంశీ వంజరి, శ్రీరాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ ప్రెస్ క్లబ్‌లో ఉద్రిక్తత.. ఇరువర్గాల దాడి



ఉప్పల్: మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు వ్యతిరేకంగా హుజూరాబాద్ నియోజకవర్గం ఈటల దళిత బాధితుల సంఘం ఆధ్వర్యంలో ఉప్పల్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఉప్పల్ నియోజకవర్గం దళిత సంఘాల నేతలు, స్థానిక బీజేపీ నేతలతో కలిసి వచ్చి ప్రెస్ మీట్‌ను అడ్డుకున్నారు. మీడియా లోగోలను విసిరి కొడుతూ సమావేశంలో పాల్గొన్న అధ్యక్షులు తిప్పారపు సంపత్‌తో పాటు ఇతర ప్రతినిధులపై దాడికి పాల్పడ్డారు. అడ్డు వచ్చిన మీడియా ప్రతినిధులను సైతం దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. దృశ్యా లను చిత్రీకరిస్తున్న వారిపై దాడి చేసి సెల్‌ఫోన్‌లను లాక్కున్నారు. మీడియా ప్రతినిధులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితులను చక్కదిద్దారు. ఈ సంఘటనకు సంబంధించి విలేకరులు ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాక ఇరు వర్గాల ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు



విగ్రహప్రతిష్ఠాపనమహోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



మహోత్సవాల్లో పాల్గొన్న తోటకూర వజ్రేష్‌యాదవ్ తదితరులు

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ ఫేస్-2, సైలెంట్ ఎవెన్యూ కాలనీలో కొత్తగా నిర్మించిన శ్రీ కనకదుర్గ విజయగణపతి, శివలింగ, సుబ్రహ్మణ్య ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవంగా ఘనంగా జరిగింది. ఈ సందర్భంగ ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, కౌన్సిలర్లు గోగుల సరితావెంకటేష్, సంపనబోల్ స్వప్నహరిగౌడ్, వరగంటి వెంకటేష్, సోమేష్, రామారావు, కృష్ణారావు, అంజిరెడ్డి, ఏనుగుసంజీవరెడ్డి పాల్గొన్నారు.

తాగునీరు, ధాన్యం కొనుగోళ్లపై పక్కా ప్రణాళిక

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్‌తో జిల్లా కలెక్టర్ గౌతమ్



సాక్షి,మేడ్చల్ జిల్లా: తాగునీటి సరఫరా, పాఠశాల మౌలిక వసతుల కల్పన, ధాన్యం కొనుగోళ్లపై మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో తగిన కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్తూ సంబంధిత శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలతో చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారితో ఆయన మాట్లాడారు. తాగునీటి సరఫరా విషయంలో మిషన్ భగీరథ ద్వారా అందుబాటులో ఉన్న వ్యవస్థను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల నేపథ్యంలో తాగునీటి సరఫరా పర్యవేక్షణకు మండల, గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, డీఎంహెచ్‌వో డాక్టర్ రఘునాథస్వామి, మిషన్ భగీరథ ఈఈ సునీత, డీఈఓ విజయ కుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ రానున్న 2 నెలల్లో పక్కా ప్రణాళికతో తాగునీటి సరఫరా చేపట్టాలని, ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులలో స్థానికంగా ఉన్న వ్యవసాయ మోటార్లను వినియోగించుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ఇబ్బందులు ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో విచ్చలవిడిగా సాగుతున్న అక్రమనిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసిన కౌన్సిలర్లు మధుసూదన్, రాజ్‌కుమార్‌యాదవ్, నర్సింగ్‌లు మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున గోదాంలు, వెంచర్లు, బహుళ అంతస్థుల భవన నిర్మాణాలు సాగుతున్నాయని తెలిపారు. కొందరి అండదండలతో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడంతో మున్సిపల్ ఆదాయానికి గండిపడుతుందని, దేవరయాంజాల్ పరిధిలో దేవాదాయ శాఖ భూములను అన్యాక్రాంతం చేస్తూ నిర్మాణాలు చేపడుతున్నారని వివరించారు. వెంటనే అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని కోరారు.

చీర్యాలలో రెడ్డి భవనం ప్రారంభం



రెడ్డిభవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఇందిరాలక్ష్మీనారాయణ, సింగిరెడ్డి లక్ష్మారెడ్డి తదితరులు

కీసర: రెడ్డిహక్కుల సాధన కోసం రెడ్డి బిడ్డలందరూ ఐక్యతతో ముందుకువెళ్లాలని సంఘం నేత సింగిరెడ్డి లక్ష్మారెడ్డి అన్నారు. చీర్యాల గ్రామంలో సోమవారం చీర్యాల గ్రామరెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన రెడ్డి భవనాన్ని ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణతో కలిసి ఆయన ప్రారంభించారు. భవన స్థలదాత సింగిరెడ్డి కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చీర్యాల గ్రామంలో రెడ్డిభవనాన్ని నిర్మించుకోవడం అభినందనీయమని ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తుంగ ధర్మేందర్, మాజీ ఉపసర్పంచ్ జిల్లాల తిరుమల్‌రెడ్డి, బండారు నీలం రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రామిడి శ్రీనివాస్‌రెడ్డి, సింగిరెడ్డి అంజిరెడ్డి, జంగారెడ్డి, సంజీవరెడ్డి, హన్మంత్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, రామిడి రాంరెడ్డి, మల్లారెడ్డి, సింగిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పాపిరెడ్డి, రెడ్డిసంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

'3డీ ప్రింటింగ్ టెక్నాలజీ'పై వర్క్‌షాప్



3డీ ప్రింటింగ్ టెక్నాలజీ వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్‌డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం '3డీ ప్రింటింగ్ టెక్నాలజీస్'పై విద్యార్థులకు ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా 3డీ ప్రింటింగ్ ప్రయోజనాలు, వాటి అప్లికేషన్స్ గురించి వివరించారు. విద్యార్థులు కొత్త డిజైన్ మోడల్స్ తయారు చేసి ప్రింట్ చేశారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి శ్రీనివాస్ చలపతి, అధ్యాపకులు జాషుకుమార్, శ్రీనివాసులు. శ్రవణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మండుటెండల్లో... చేపలు చనిపోకుండా..

పెంపకందారులకు జిల్లా మత్స్యశాఖ సూచనలు



పూర్ణిమా



సాక్షి,మేడ్చల్ జిల్లా: వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రత కారణంగా నీరు క్రమేపి తగ్గటంతో ప్రాణవాయువు కొరత, నీటినాణ్యత తగ్గిపోయి చేపలు తీవ్రమైన ఒత్తిడికి గురై కొన్ని సందర్భాలలో చనిపోతుంటాయని జిల్లా మత్స్య శాఖ అధికారి పూర్ణిమా తెలిపారు. రోగకారక సూక్ష్మజీవులతో కూడా వ్యాధులు సంభవిస్తామయని తెలిపారు. ఈ నేపథ్యంలో మత్స్యకారులు పలు జాగ్రత్తలను పాటిస్తే.. ఆర్థిక నష్టం జరగదని ఆమె పేర్కొన్నారు. చెరువులోని నీటి నాణ్యత, లోతు, విస్తీర్ణం, చేపల కదలికలు ప్రతి రోజు గమనిస్తూ ఉండాలని తెలిపారు.

- చెరువులోని కొన్ని చేపలను మచ్చుకు పెట్టి వాటి పెరుగుదల, రంగు, తోక, రెక్కల స్వభావం, మొప్పెల రంగు, పై జిగురు లక్షణాలను నిశితంగా పరిశీలించాలన్నారు. ఇందులో తేడాలు గమనించిన ఎడల సంబంధిత మత్స్య శాఖ సూచనలు తీసుకొని నివారణ, నియంత్రణ చర్యలు సత్వరమే చేపట్టి ఆర్థిక నష్టాన్ని తగ్గించుకోవాలని సూచించారు.
- చెరువులో నీటి నాణ్యత తగ్గిపోయినప్పుడు సున్నం ఒక హెక్టారుకు 100 నుంచి 250 కిలోల వరకు చెరువులో చల్లినట్లయితే.. నీటి నాణ్యత పెరగడమే కాకుండా ప్రాణవాయువు శాతం పెరిగి, ఉదజని సూచికను అదుపులో ఉంటుందని తెలిపారు.
- చెరువులోని కలుపు మొక్కలని ఎప్పటికప్పుడు తగ్గిస్తూ ఉండాలని పూర్ణిమా పేర్కొన్నారు. లేని ఎడల రాత్రి సమయాలలో కేవలం కార్బన్ డయాక్సైడ్ విడుదల వల్ల చేపలు తీవ్ర ప్రాణవాయువు కొరతతో చనిపోతాయన్నారు.
- వ్యాధితో చేపలు చనిపోయినప్పుడు వెంటనే వాటిని తొలగించి చెరువుకు దూరంగా కాల్చి వేయటమో లేదా ఒక గోతి తీసి అందులో పూడ్చి వేయటమో చేయాలన్నారు.
- ప్రాణవాయువు పెంచుకోవడానికి చెరువులోని నీటిని మోటార్ల ద్వారా రీసైక్లింగ్ చేస్తే.. విషవాయువు తగ్గి ప్రాణవాయువు శాతం పెరుగుతుందని పూర్ణిమా పేర్కొన్నారు.